క్లుప్తంగా

21న ట్యాబ్‌ల పంపిణీ

అల్లిపురం: ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా 8, 9 తరగతుల విద్యార్థులకు బైజ్యూస్ ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నట్టు వైఎస్సార్ సీపీ 33వ వార్డు సీనియర్ నాయకుడు రంధి గోపి తెలిపారు. ఈ మేరకు శనివారం డాబాగా ర్డెన్స్‌లోని ఎంజీఎం హైస్కూల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలసి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ అర్ధశతాబ్ది వేడుకల లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న లక్ష్మి

డాబాగార్డెన్స్: ప్రగతి శీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) అర్ధ శతాబ్ది వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి కోరారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో వార్షికోత్సవాల లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 50 ఏళ్ల ఉద్యమ ప్రవాహంలో అనేక అడ్డంకుల్ని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. లోగో ఆవిష్కరణలో యూ.ఇందిర, ఎల్.వరలక్ష్మి, గీత, లక్ష్మి, కె.జయ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల తరువాత కుటుంబ సభ్యుల చెంతకు..



రామచంద్రముర్ము‌ను (పసుపు టీ షర్టు) కుటుంబ సభ్యులకు అప్పగించిన సభ్యులు

అల్లిపురం: మతిస్థిమితం లేకుండా రోడ్డుపై తిరుగుతున్న ఒక వ్యక్తిని జీవీఎంసీ ఏయూటీడీ సభ్యులు నాలుగేళ్ల క్రితం రక్షించి మానసిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందజేశారు. అతనికి ఆరోగ్యం మెరుగుపడి ఊరుపేరు తెలియజేశారు. దీంతో ఏయూటీడీ సిబ్బంది అతని వివరాలు పూణేకు చెందిన శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులకు తెలియజేశారు. దీంతో వారు బాధితుడు ఒడిశా రాష్ట్రం మయూర్ బంజ్ జిల్లా, బచ్చుత్తర్ గ్రామానికి చెందిన రామచంద్ర ముర్ముగా గుర్తించారు. అతనిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమది పేద కుటుంబమని, ఆర్థిక పరిస్థితులు సహకరించక వెతకలేకపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యుడిని అప్పగించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పథకాల మంజూరులో జాప్యం చేయొద్దు

మహారాణిపేట: ఎయిడ్స్ బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ కోరారు. జిల్లా టీబీ ఆస్పత్రి ఆవరణలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అవగాహన లేకపోవడం వల్ల ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిశోర్, ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగభూషణరావు, ఆర్ఎంవో డా.శాస్త్రి, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా మేనేజర్ అఖిల, తదితరులు పాల్గొన్నారు.

'బల్లిగిరి'కి ధనుర్మాస శోభ

అల్లిపురం: బల్లిగిరి శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ధనుర్మాశ శోభ సంతరించుకుంది. ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. శనివారం అర్ధరాత్రి 12.23 గంటలకు ధనుర్మాసం ప్రవేశంతో నెలగంట మోగించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. వచ్చే జనవరి 14 వరకు ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంతో నెలగంట ప్రారంభమైనట్లేనని ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు తెలిపారు.

ఇది కదా అభివృద్ధి

మా స్కూల్ సూపర్



ప్రైమరీ పాఠశాల తరగతి గదిలో చిన్నారులు

- ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు
- రూ.33.30 లక్షలతో జీవీఎంసీ ప్రకాశరావుపేట హైస్కూల్ ఆధునికీకరణ
- రూ.20.75 లక్షలతో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి

దేశ భవిష్యత్తు రూపుదిద్దుకునేది తరగతి గదుల్లోనే అన్న విద్యావేత్తల అభిప్రాయాన్ని దృఢంగా విశ్వసించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారు. మౌలిక వసతులతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా డిజిటల్ తరగతులకు శ్రీకారం చుట్టారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు.



జీవీఎంసీ ప్రకాశరావుపేట స్కూల్

డాబాగార్డెన్స్: ప్రకాశరావుపేట ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తయారయ్యాయి. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో అన్ని వసతులు కల్పించారు. విద్యార్థినీ విద్యార్థులుకు విడిగా టాయిలెట్స్ ఆధునికీకరించారు. అంతేగాక చైల్డ్ విత్ స్పెషల్ నీడ్స్(సీడబ్ల్యూఎస్ఎన్)తో ప్రత్యేక టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. నీటి కొరత లేకుండా ఉండేందుకు బోర్‌వెల్ వేశారు. ప్రతి తరగతి గది ఫ్లోరింగ్ మార్చారు. ఇప్పటి వరకు ఉన్న ఒకే ఒక్క గేట్‌ను రెండు (ఇన్ అండ్ అవుట్) గేట్లుగా ఏర్పాటు చేశారు. ప్రతీ తరగతి గదికి 4 ఫ్యాన్లు, 4 ట్యూబ్‌లైట్లు వేశారు. మంచినీటికి సంబంధించి పాఠశాల పై భాగాన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. ప్రతీ తరగతి గదిలో డోర్లు, కిటికీలు, కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేశారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది కోసం టేబుల్స్, చైర్స్ సమకూర్చారు. పాఠశాల అసెంబ్లీ ప్రాంగణమంతా అందంగా తీర్చిదిద్దారు. పాఠశాల చుట్టూ బౌండరీ వాల్ నిర్మించారు. అన్ని తరగతి గదుల్లో గ్రీన్ బోర్డ్స్, వాష్ బేసిన్స్, గ్రిల్స్, గేట్లు, నేమ్ బోర్డులు ఏర్పాటు చేశారు.

ఐఎఫ్‌పీ ద్వారా బోధన

సాంకేతిక ప్రగతిని సర్కారు బడుల్లోని విద్యార్థులకు చేరువ చేసేలా డిజిటల్ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డ్ (ఐఎఫ్‌పీ) ద్వారా అత్యున్నత ప్రమాణాలతో విద్య అందుతోంది. దీని ద్వారా విద్యార్థులకు దృశ్య, శ్రవణ పద్ధతుల్లో సరికొత్తగా పాఠాలు బోధిస్తున్నారు. తరగతికి సంబంధించిన పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్ తదితర అంశాలను వివరిస్తున్నారు.

హైస్కూల్
గతంలో విద్యార్థుల సంఖ్య : **320**
ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య : **560**

ప్రాథమిక పాఠశాల
గతంలో విద్యార్థుల సంఖ్య : **180**
ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య : **360**



ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు శాస్త్ర సాంకేతికరంగం గూర్చి వివరిస్తున్న ఉపాధ్యాయుడు



నాడు నేడులో అధునాతనంగా తీర్చిదిద్దిన హైస్కూల్ ప్రాంగణం

అభివృద్ధి ఇలా.. ప్రకాశరావుపేట హైస్కూల్

మొత్తం నిధులు : రూ.33.30 లక్షలు
- రూ.4, 37, 823 లతో టాయిలెట్స్ ఆధునికీకరణ
- రూ. 3,02, 317 లతో తాగునీటి సదుపాయం
- రూ. 12,75,178 లతో మేజర్ వర్క్స్
- రూ.3,39,977 లతో ఎలక్ట్రిఫికేషన్
- రూ.1,36,106 తో ఫర్నిచర్
- రూ.20,619 తో జీసీబీ
- రూ.4,77,170 తో పెయింటింగ్స్
- రూ.3,40,969 తో ప్రహరీ నిర్మాణం

ప్రాథమిక పాఠశాల

మొత్తం నిధులు: రూ.20.75 లక్షలు
- రూ.5,74,293 తో టాయిలెట్స్, రన్నింగ్ వాటర్
- రూ.1,39,541 తో డ్రింకింగ్ వాటర్
- రూ.8,65,206తో మేజర్, మైనర్ వర్క్స్
- రూ.1,60,092 తో ఎలక్ట్రిఫికేషన్
- రూ.62,623తో ఫర్నిచర్
- రూ.28,364తో గ్రీన్ చాక్ బోర్డులు
- రూ.1,92,014 తో పెయింటింగ్స్
- రూ.33,965 తో ఇంగ్లీష్ ల్యాబ్

అభివృద్ధి అద్భుతం



రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధికి సంబంధించి చేపడుతున్న చర్యలు అద్భుతం. అన్ని వసతులు కల్పించారు. ఉన్నత ప్రమాణాలతో విద్య అందుతోంది. ఫలితంగా విద్యార్థుల సంఖ్య రెట్టింపు పెరిగింది. జీవీఎంసీ పరిధిలో చాలా స్కూల్స్ అప్పర్ ప్రైమరీ వరకే ఉన్నాయి. వాటిని హైస్కూల్ స్థాయికి ప్రమోట్ చేస్తే ఇంకా బాగుంటుంది. పాఠశాలల అభివృద్ధికి, విద్యకు ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి హ్యాట్సాఫ్.
– శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు, జీవీఎంసీ ప్రకాశరావుపేట హైస్కూల్

అన్ని వసతులు ఉన్నాయి



మా పాఠశాల ప్రాంగణం ఎంతో బాగుంది. మేం చదువుకునేందుకు అన్ని వసతులు ఉన్నాయి. బెంచీలు, కుర్చీలు బాగున్నాయి. గ్రీన్‌బోర్డు ద్వారా అక్షరాలు క్లియర్‌గా ఉంటున్నాయి. టాయిలెట్స్ శుభ్రంగా ఉంటున్నాయి.
– నవ్య, 6వ తరగతి విద్యార్థిని

మంచిగా పాఠాలు చెబుతున్నారు



మా స్కూల్ ఎంతో పరిశుభ్రంగా ఉంటోంది. ప్రైవేట్ స్కూల్లో మాదిరిగానే యూనిఫాం, షూ, బుక్స్ అన్నీ కొత్తవి ఉంటున్నాయి. ఉపాధ్యాయులు మాకు మంచిగా పాఠాలు చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం చాలా రుచిగా ఉంటోంది. అన్ని విధాలుగా మా స్కూల్ సూపర్.
– అక్షయ, 7వ తరగతి విద్యార్థి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సెయింట్ జోసెఫ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న 55 ఏళ్ల పూర్వ విద్యార్థిని డాక్టర్ వర్ధిని

డాబాగార్డెన్స్: సెయింట్ జోసెఫ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగింది. కళాశాల పూర్వ విద్యార్థినులు ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ ఆచార్య శ్యామల, సిద్ధార్థ మెడికల్ కళాశాల ఆచార్య దుర్గారాణి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఝుషైజీ, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు డాక్టర్ మంగవేణి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ వై.లక్ష్మీప్రభ.. పూర్వ విద్యార్థులను ఆహ్వానించారు. కళాశాలతో ఉన్న అనుబంధాన్ని, అధ్యాపకుల ఆత్మీయతను, మిత్రులతో మధుర జ్ఞాపకాలను విదార్థినులు పంచుకున్నారు. కళాశాల క్యాలెండర్‌ని ప్రిన్సిపాల్ ఆవిష్కరించి అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, నాటికలు అలరించాయి. 55 ఏళ్ల డాక్టర్ వర్ధిని కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులు తమ కళాశాల ప్రాంగణాన్ని, తరగతి గదుల్ని, లైబ్రరీని సందర్శించి ఫొటోలు తీసుకున్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో వచ్చే మూడో శనివారం నిర్వహించే ఈ ఆత్మీయ సమావేశానికి తప్పక హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. 200 మందికి పైగా పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారని మీడియా ఇన్‌చార్జ్ డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల మూడో రోజు శనివారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీచక్రనవావరణార్చన, లక్ష్మీహోమం, మార్గశిర మాస విశేష కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చనలు, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహా విద్యాపారాయణలు మండపంలో నిర్వహించారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చనలు జరిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహావిద్యా పారాయణ నిర్వహించారు. మధ్యాహ్నం జగన్నాథ స్వామి ఆలయంలో అన్నసమారాధన చేశారు.

రక్తదాతలు .. ప్రాణదాతలు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న డీసీవో ప్రవీణ, చిత్రంలో పలు శాఖల అధికారులు

మహారాణిపేట: ఆపదలో ఉన్నవారికి రక్తం దానం చేసేవారు ప్రాణదాతలని జిల్లా సహకార శాఖ అధికారి(డీసీవో) టి. ప్రవీణ అన్నారు. ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ సొసైటీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ సమీపంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. నేవల్ డాక్‌యార్డు మేజర్ వైదేహి మాట్లాడుతూ దేశంలో రక్తనిల్వల కొరత ఉందని, ప్రతీ ఒక్కరు రక్తదానం చేస్తే ఆ కొరతను భర్తీ చేయవచ్చని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వై.శివనాగేంద్ర రెడ్డి మాట్లాడుతూ రక్తదానంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్డి వెంకటరావు, పర్యవేక్షక మండలి సభ్యులు, విశాఖ ఉద్యోగ సహకార సంఘాల కన్వీనర్, సొసైటీ అధ్యక్షులు కె.వి.వి.వి.ఎస్.డి.కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎం.మంజు, కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం ప్రాముఖ్యతపై ప్రచారం అవసరం



కూటికుప్పలను సన్మానిస్తున్న కవులు

మహారాణిపేట: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో పుస్తక పఠనంపై నిర్లక్ష్యం ఏర్పడుతోందని ప్రముఖ వైద్యుడు, పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో అరసం విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సమాజంలో వాస్తవ పరిస్థితులను ప్రజలకు అందించేందుకు కవులు ముందుకు రావాలని కోరారు. కవులు ఎస్. హనుమంతరావు, శేఖరమంత్రి, ఆదిరెడ్డి, పి.శ్యాంసుందర్, రత్నరాజు, ఫ్రాన్సిస్, పద్మజ, బి.పావని, డి.విశాలాక్షి తదితరులు పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దమన కాండను ఖండిస్తూ కవితలు చదివారు. అనంతరం కవులను కూటికుప్పల సన్మానించారు. అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు,బండి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం అలరించింది.

వైద్యసేవల కోసం మొబైల్ సర్వీస్ వ్యాన్

మహారాణిపేట: ‘సర్వీస్ ఆన్ వీల్స్’.. అత్యాధునిక మొబైల్ సర్వీస్ వ్యాన్‌ను రుషికొండ సాయిప్రియ రిసార్ట్స్‌లో శనివారం ప్రారంభించారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐసీవోఎన్) 83వ జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా శనివారం ఈ వాహనాన్ని ప్రారంభించారు. శస్త్ర చికిత్సలతో పాటు పలు వైద్య కార్యక్రమాల కోసం ఈ వాహనం ఉపయోగించవచ్చని ఏఎస్ఐసీవోఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ జైన్ తెలిపారు. ఇది వైద్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్, కార్యదర్శి సంతోష్ జాన్ అబ్రహం, ఏపీ చాప్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శాంతారావు, కార్యదర్శి డాక్టర్ పీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయండి

- సమస్యలు లేని వార్డులుగా తీర్చిదిద్దుదాం
- సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే వాసుపల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని, నియోజకవర్గంలో సమస్యలు లేని వార్డులుగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో వాసుపల్లి మాట్లాడారు. మూడు నెలల్లో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. రాజకీయంలో ఒడుదుడుకులు సహజమని, వాటిని తట్టుకుని ముందుకు వెళ్తూ విజయం సాధించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పలువురు డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

38వ వార్డులో ఎమ్మెల్యే వాసుపల్లి పర్యటన

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం 38వ వార్డులో పర్యటించారు. బుక్కా వీధి, చెంగల్రావుపేట, కంచరవీధి, కాదంబరి వారి వీధి, గాంధీ బొమ్మ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తనకు చెప్పాలని.. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బుక్కావీధి బీచ్‌రోడ్డు జంక్షన్ వద్ద కల్వర్టు సమస్యలు, పెద్ద కాలువ వద్ద జీ ప్లస్ వన్ సామాజిక భవనం నిర్మించాలని స్థానికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పలువురు డైరెక్టర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఆలయ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సన్యాసిరావుకు డాక్టరేట్



సన్యాసిరావుకు డాక్టరేట్ అందజేస్తున్న డాక్టర్ ఆనంద్‌కుమార్

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి పీఏ సన్యాసిరావు(సన్నీ)కు హెచ్ఎస్‌సీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. నగరంలోని పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సన్యాసిరావుకు యూనివర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్‌కుమార్ డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ టీచర్ ట్రైనింగ్ నుంచే తనకొచ్చిన ఉపకార వేతనం రూ.1800తో సేవలు ప్రారంభించానన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లిని ఆదర్శంగా తీసుకుని సేవలందిస్తున్నట్టు తెలిపారు. మోర్చా చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో సహాయం చేస్తున్నానన్నారు.

కిడ్నీ బాధితులకు సాయం



జవ్వాది ప్రసాద్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



లక్ష్మీరాజుని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్.

డాబాగార్డెన్స్: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న జవ్వాది ప్రసాద్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.60వేలు చెక్కును ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అందజేశారు. డాబాగార్డెన్స్ ప్రాంతానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులు ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందజేయగా, స్పందించిన వాసుపల్లి తక్షణమే సీఎం క్యాంపు కార్యాలయానికి అర్జీ పెట్టారు. ఈ మేరకు చెక్కును శనివారం అంజేశారు.

33వ వార్డులో..

అల్లిపురం: ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముందుంటున్నారు. శనివారం 33వ వార్డుకు చెందిన లక్ష్మీరాజు రెండు కిడ్నీలు పాడైపోవడతో నగరంలో పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను ఎమ్మెల్యే పరామర్శించి తన సొంత నిధుల నుంచి రూ.50వేలు అందజేసి అండగా నిలిచారు. వైద్యులతో ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందజేయాలని కోరారు. ఆమె ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ చికిత్సపై వైద్యులకు అవగాహన



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న వైద్యులు

ఎంవీపీకాలనీ: బ్రెయిన్ స్ట్రోక్ పై యువ వైద్యులకు అవగాహన కల్పించేందుకు ఇండియన్ సొసైటీ ఆఫ్ న్యూరో రేడియాలజీ , స్ట్రోక్ ఆఫ్టేట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో జాతీయ కాన్ఫరెన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ రేడియోలజిస్ట్ మెడికవర్ హాస్పటల్స్, ఐఎస్ఎన్ఆర్–2023 ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శిభా శంకర్ దళాయి అధ్యక్షతన శనివారం నోవెటల్ హోటల్‌లో ఈ కాన్ఫరెన్స్ జరిగినట్లు మెడికవర్ యాజమాన్యం తెలిపింది. 30 మంది సీనియర్ డాక్టర్లు, ప్రొఫెసర్లు ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరయ్యారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 500 మంది యువ వైద్యులు పాల్గొన్నారు. ఐఎస్ఎన్ఆర్ ప్రెసిడెంట్ డాక్టర్ శైలేష్ గైక్వాడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ అరవింద్ వర్మ దట్ల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న డాక్టర్ సీతారాం

విశాఖ విద్య: పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు 'పాఠశాలల్లో విద్యార్థులకు చేపట్టాల్సిన భద్రతా ప్రమాణాలు–సైబర్ సెక్యూరిటీ అంశాలు' పై జిల్లా స్థాయి వర్క్ షాప్ శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. గాజువాక మండల విద్యాశాఖాధికారి సునీత అధ్యక్షతన జరిగిన సదస్సులో గొండు సీతారాం మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతా ప్రమాణాలు పాటించేందుకు ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్యాలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో సైబర్ సెక్యూరిటీ, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీఈఆర్టీ చైల్డ్ సేఫ్టీ రాష్ట్ర నోడల్ అధికారి ఎం.సోమశేఖర్ మాట్లాడుతూ జాతీయ,రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ల ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం, భద్రతా ప్రమాణాల్లో భాగంగా వివిధ రకాల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రతినిధి నిహారిక, భీమిలి డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్ రవి, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.